ఎన్నెన్నో అందాలు..

పచ్చదనం తొణికిసలాడుతున్న ఈ చిత్రం చూడండి.. ఎంత ఆహ్లాదకరంగా ఉందో కదూ.. ఇది మరెక్కడో కాదండి.. మన దగ్గరే.. సారవకోట మండలం గుమ్మపాడు పంచాయతీలో ఆశోకం గ్రామం ఇది.. ఇక్కడి నుంచి ప్రకృతిని తనివితీరా చూడొచ్చు.. కేవలం పది గిరిజన కుటుంబాలే నివసిస్తున్నాయి. వారు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నాలుగు కొండల మధ్య విశాలమైన స్థలం ఉంది. పర్యాటకానికి అనువుగా ఉండే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సారవకోట



లెక్క తేలింది.. లక్కు ఎవరిదో..!

- 4,594 దరఖాస్తులు.. రూ.91.88 కోట్ల ఆదాయం
- ముగిసిన స్వీకరణ ప్రక్రియ

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, పాత శ్రీకాకుళం

పదకొండు రోజుల పాటు సాగిన మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. చివరి రోజున ఏకంగా 971 దరఖాస్తులు అందాయి. జిల్లాలో మొత్తం 158 మద్యం దుకాణాలకు 4,594 దరఖాస్తులు అందాయి. దీని ద్వారా జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ. 91.88 కోట్ల ఆదాయం సమకూరినట్లయింది. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల అధ్యాయం ముగిసి ప్రైవేటు దుకాణాలు అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాలకు ఎవరికి వరిస్తాయోననే ఉత్కంఠ నెలకొంది. అత్యధికంగా శ్రీకాకుళం, రణస్థలం సర్కిళ్ల నుంచి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి.

ఏ ప్రాంతంలో ఎన్నెన్ని వచ్చాయంటే..

సర్కిల్	మద్యం దుకాణాలు	వచ్చిన దరఖాస్తులు
శ్రీకాకుళం	32	1061
ఆమదాలవలస	13	367
రణస్థలం	15	662
పొందూరు	10	353
నరసన్నపేట	12	285
కొత్తూరు	07	205
పాతపట్నం	08	236
టెక్కలి	11	293
కోటబొమ్మాళి	15	339
పలాస	15	234
సోంపేట	12	313
ఇచ్ఛాపురం	08	246

వారిని కాదని వీరికి వస్తే..?

చాలాకాలంగా మద్యం వ్యాపారాలు చేస్తున్న వారు ఓ వైపు, అదృష్టాన్ని పరీక్షించుకునే వారు, ఆశావాహులు మరోవైపు, సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకున్నవారు ఇంకో వైపు. ఇలా అందరూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జిల్లాలో కొందరు నేతలు తమను కాదని దరఖాస్తు వేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.. ఈ నేపథ్యంలో ఆయా నేతల మాట కాదని దరఖాస్తు చేసుకున్న వారికి దుకాణం వస్తే తర్వాత పరిస్థితి ఏంటనే ప్రశ్న కొందరిలో కలుగుతోంది.


అత్యల్పంగా కొత్తూరు, పలాస, పాతపట్నం

జిల్లాలో ఇతర ప్రాంతాలతో పోలిస్తే పాతపట్నం నియోజకవర్గంలోనే తక్కువగా దరఖాస్తులు అందాయి. దీనికి స్థానిక నేతలు ఆశావాహులు, వ్యాపారులకు దరఖాస్తు చేయొద్దని హుకుం జారీ చేసినట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇక్కడ తక్కువ దరఖాస్తులు వచ్చాయని బహిరంగంగానే చర్చ సాగుతోంది. తొలుత మంత్రి అచ్చెన్న నియోజకవర్గంలో తక్కువగా వచ్చినా గత రెండు రోజుల్లోనే టెక్కలి, కోటబొమ్మాళి పరిధిలో దరఖాస్తుల సంఖ్య పెరిగింది.

14న లాటరీ...

ఇప్పటి వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచిన మద్యం దుకాణాలు ఇకపై ప్రైవేటుపరం కానున్నాయి. 12, 13వ తేదీల్లో దరఖాస్తుల పరిశీలన చేస్తారు. 14న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో అధికారుల సమక్షంలో లాటరీ తీస్తారు. దరఖాస్తుదారులంతా ఉదయం ఏడు గంటలకు అక్కడికి చేరుకోవాలి. ప్రవేశ పత్రం, గుర్తింపు కార్డుతో దరఖాస్తుదారుని మాత్రమే లోనికి అనుమతిస్తారు. అతను రాని పక్షంలో అధీకృత బాధ్యుడిని అనుమతిస్తారు. లాటరీ గెజిట్ నోటిఫికేషన్ సీరియల్‌లో జరుగుతుంది. అంటే తొలుత శ్రీకాకుళం, చివరన ఇచ్ఛాపురంలో దుకాణాలకు లాటరీ తీస్తామని ఎక్సైజ్ సూపరింటిండెంట్ సీహెచ్ తిరుపతి నాయుడు తెలిపారు. 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు.

మా ఊరి దసరా..!



సిక్కోలు గడ్డ దసరా శోభతో వెలిగిపోతోంది.. ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడే దర్శనమిస్తోంది.. దుర్గమ్మ నామస్మరణే మారుమోగుతోంది.. వలసవెళ్లిన ప్రజలు, ఉపాధి, ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో ఉన్నవారంతా స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో ఇంటింటా పండగ వాతావరణం నెలకొంది. మరోపక్క ఆలయాలు, దేవీ మండపాలు, శక్తి పీఠాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.. మరోపక్క జిల్లాలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా దసరా జరుపుకొంటున్నారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



బలగ కాలభైరవాలయంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్

దసరా అయ్యే వరకు కదలరు..!

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల్లో దసరాకు ప్రాధాన్యం ఉంటుంది. పండగ ముందు వచ్చే మంగళవారం జయవార దసరాగా వేడుకలు నిర్వహిస్తారు. దీన్ని వాడుక భాషలో దొంగ దసరా అని కూడా అంటారు. ఇచ్ఛాపురం పట్టణ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల వారికీ ఈ ఆచారం ఉంది. పంట భూములు ఉన్న వారందరూ (కౌలు రైతులతో సహా) గ్రామంలోని అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. ఏడాదంతా చల్లగా చూడాలని.. పాడి పంటలు సంవృద్ధిగా ఉండేలా కరుణించమని వేడుకుంటారు. ఆలయంలో అమ్మవారి ఎదుట పత్రికొమ్మల్ని పెడతారు. వాటిపై కొందరు జంతుబలి రక్తాన్ని ఉంచుతారు. బుధవారం పత్రికొమ్మ ఆకుల్ని పంట భూముల్లో వెదజల్లారు. ఇలా చేస్తే పంటలు బాగా పండుతాయని ప్రజల విశ్వాసం. ఈ పండగ నిర్వహణకు దూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం స్వగ్రామాలకు చేరుకుంటారు. దసరా పూజలు పూర్తయ్యే వరకు తిరిగి వెళ్లరు. ఈ ఆచారాన్ని ప్రస్తుత తరం కూడా ఆచరిస్తుందని బెల్లుపడ, రత్తకన్న, మునిభద్ర గ్రామస్థులు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



పూజలు చేయడానికి ఆలయానికి వెళ్తున్న భక్తులు

చిన్నారులు.. అమ్మవారి ప్రతిరూపాలు



పదేళ్ల లోపు వయసు గల బాలికలను బాలాత్రిపురసుందరీదేవి రూపాలుగా భావించి పూజలు (కుమారి పూజగా) చేసే ఆచారం ఇచ్ఛాపురం పట్టణం లాలాపేటలో పలు కుటుంబాలకు ఉంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో బంధువుల కుటుంబాల్లోని చిన్నారులకు ఈ పూజలు చేస్తారు. ఉదయమే తలంటు పోసి కొత్త దుస్తులు తొడుగుతారు. ఆభరణాలు అలంకరించి అమ్మవారికి చేసినట్లే పసుపు, కుంకుమ, చందనం, ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. ఇళ్లలోనే ఈ క్రతువులు నిర్వహిస్తారు. దసరాకు మూడు రోజుల ముందు నుంచి కుమారి పూజలు వైభవంగా నిర్వహిస్తారని పట్టణానికి చెందిన పైల శ్రీనివాస్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కుమారీ రూపాలుగా బాలికలు

జయ జయహే మహిషాసుర మర్దని....

జిల్లా వ్యాపంగా దుర్గమ్మ శుక్రవారం మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. అమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



శ్రీకాకుళం: రామలక్ష్మణకూడలి దుర్గామహాలక్ష్మి ఆలయంలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలు

మూడు కేసుల్లో నలుగురు నిందితుల అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఒంటరి మహిళలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోంపేట స్టేషన్ పరిధిలో ఒకటి, కాశీబుగ్గలో రెండు గొలుసు దొంగతనాల కేసులను ఛేదించినట్లు చెప్పారు. కాశీబుగ్గకు సంబంధించిన రెండు కేసుల్లో సుమారు రూ. 7.70 లక్షలు విలువైన 11 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోంపేట కేసులో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు ఒడిశా రాష్ట్రం బరంపురంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో తాకట్టు ఉన్నాయని, వాటిని రికవరీ చేసేందుకు నోటీసులిచ్చినట్లు వివరించారు. రాజగోపాల్ అనే వ్యక్తి ముందుగా రెక్కీ నిర్వహించి.. ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, మహిళల ఇళ్లలో ఏ1 కిరణ్, ఏ2 ఉమామహేశ్వరరావుతో కలిసి చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. రాజగోపాల్, కిరణ్ తండ్రీకొడుకులు. మెళియాపుట్టికి చెందిన ఉమామహేశ్వరరావుపై గతంలోనూ కేసులున్నట్లు తెలిపారు. వీరికి ఓ మహిళ కూడా సాయపడినట్లు వివరించారు. కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీఐలు డి.మోహన్‌రావు, మంగరాజు, ఎస్సై బి.హైమావతి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో ఇతర అధికారులు

నీలగిరి పేరు.. నిబంధనలకు నీళ్లు..!

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, బలగ(శ్రీకాకుళం), రణస్థలం

పుష్ప సినిమాలో పోలీసుల కళ్లు గప్పి పాల ట్యాంకర్‌లో ఎర్రచందనం దుంగల్ని తరలించడం చూసే ఉంటారు కదా.. జిల్లాలోనూ అదే తరహాలో కొందరు అక్రమార్కులు చెలరేగుతున్నారు. అటవీ సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ రూ.కోట్ల విలువైన సంపదను ఎత్తుకెళ్లిపోతున్నారు. నీలగిరి పేరు చెప్పి అకేశు కర్రను నిబంధనలకు విరుద్ధంగా ఊళ్లు దాటించేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులే వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



ఎచ్చెర్లలో ఓ కాటా కేంద్రం వద్ద పైన నీలగిరి, కింద అకేసు కర్రలు వేసి లోడు చేసిన లారీ

జిల్లాలో రెండేళ్ల నుంచి నీలగిరి కలపకు డిమాండ్ పెరిగింది. కాగితం, ప్లైవుడ్ తయారీకి ఎక్కువగా వినియోగిస్తారు. గతంలో మధ్యవర్తులు, వ్యాపారులు ఊరూరా తిరిగి తోటలను అధిక ధరలు కొనుగోలు చేశారు. రాజమహేంద్రవరం, భద్రాచలం, రాయగడలోని పేపర్ మిల్లులకు రవాణా జరిగేది. కాలక్రమేణా నీలగిరి కర్రల ఉత్పత్తి తగ్గిపోయింది. అయినా డిమాండ్‌ను అదునుగా చేసుకొని కొందరు అక్రమానికి తెరలేపారు. అటవీ సంపదకు చెందిన అకేశు కర్రను నీలగిరితో కలిపి తరలించేస్తూ జేబులు నింపుకొంటున్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు..



రాత్రి సమయంలో పేపర్ మిల్లు వద్ద సరకు అన్‌లోడ్ చేసిన పత్రం

కాటాల నిర్వాహకులు, మధ్యవర్తులు కుమ్మక్కై ఈ అక్రమ రవాణా ద్వారా రూ.కోట్లు దోచుకుంటున్నారు. అసలు నీలగిరి సాగు చేయని రైతుల పాసు పుస్తకాలు చూపిస్తూ.. వారి నుంచే కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టిస్తున్నారు. సరకు కాగితపు మిల్లుకు వెళ్లే వరకు వ్యవహారం అంతా కాటా నిర్వాహకులే చూసుకుంటారు. ప్రణాళిక ప్రకారం సరకు పేపర్ మిల్లుకు రాత్రి సమయంలో పంపి.. ఆ సమయంలో అక్కడ అన్‌లోడ్ చేస్తారు. జిల్లాలో ఎక్కువ శాతం కాటా కేంద్రాలు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్నాయి. ఎచ్చెర్ల, పొందూరు, లావేరు మండలాల్లోని కేంద్రాల నుంచే ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతోంది.

దందా జరుగుతోందిలా..

- గార మండలంలోని మొగదాలపాడు, ఎచ్చెర్లలోని షేర్‌మహ్మద్‌పురం కొండ, కుప్పిలి, రణస్థలంలోని పాతర్లపల్లి, కోష్ట, పొందూరుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక రైతుల నుంచి మధ్యవర్తులు అకేశు కర్రను కొనుగోలు చేస్తారు.
- వాటిని వాహనాల బరువు తూచే కాటా కేంద్రాలు వద్దకు తీసుకొస్తారు.
- అక్కడ లారీల్లో కింద భాగంలో అకేశు కర్ర వేసి.. పైన నీలగిరి కర్రల లోడు కనిపించేలా సర్దుతారు.
- రెండు కర్రలు పైన తొక్కు తీసేస్తే చూడటానికి ఒకేలా ఉంటాయి. అందుకే కాటాల వద్దే తొక్కు తీసి రెండింటినీ కలిపి లోడు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున్న తరలిపోతున్న రూ.కోట్ల విలువైన అకేశు కర్ర

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అటవీశాఖ సిబ్బంది

పట్టించుకోని యంత్రాంగం..

దళారులు రైతుల నీలగిరి టన్ను రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. దాన్ని కాగితపు పరిశ్రమకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు అమ్ముతున్నారు. ఒక లారీలో 20 నుంచి 30 టన్నుల కలప రవాణా చేయొచ్చు. దాని విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుంది. ఒక్క ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కాటా కేంద్రాల నుంచే రోజుకు 30 వరకు లారీల్లో ఆకేశు కర్ర తరపోతుంది. ఇలా రోజుకు రూ.1.3 కోట్ల అటవీ సంపద తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారికి రూ. 6 లక్షలు వరకు అపరాధ రుసుం విధించాం. ఆకేశు కర్రను తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాం. అక్రమంగా రవాణా చేస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. – ఎస్.వెంకటేశ్, జిల్లా అటవీశాఖాధికారి

ఆడపిల్లలను చిన్నచూపు చూడటం సరికాదు



కొన్ని కుటుంబాల్లో ఇప్పటికీ ఆడపిల్లలను చిన్నచూపు చూస్తుండటం సరికాదని ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు విద్య, వైద్య, క్రీడా రంగాల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. వారిని మరింత ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. అనంతరం ఆడపిల్లలను కాపాడుకుందాం గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఇటీవల వివిధ ప్రాజెక్టుల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పీడీ శాంతిశ్రీ, ఆర్డీవో సాయిప్రత్యూష, డీఎస్‌డీవో శ్రీధర్, పర్యాటక అధికారి నారాయణరావు సిబ్బంది పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

పండగ పూట ఉడకని పప్పు..!



ఉర్లాంలో పంచదార, బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారు

దసరా పండగ పురస్కరించుకొని ప్రతి తెల్లకార్డుదారుడికి అక్టోబరు నెలలో చౌక దుకాణాల ద్వారా కిలో కందిపప్పు రాయితీ ధరతో అందిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ జిల్లాలో చాలా మంది లబ్ధిదారులకు ఇప్పటికీ అందలేదు. బయట మార్కెట్లో కిలోపప్పు ధర రూ.200 వరకు పలుకుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం అందించే పప్పు దసరాకు ఉపయోగపడుతుందని అంతా భావించారు. గ్రామాల్లో వచ్చే ఎండీయూ వాహనాల ద్వారా పంచదార, బియ్యమే ఇచ్చినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. నరసన్నపేట, పోలాకి, గార, శ్రీకాకుళం, కోటబొమ్మాళి మండలాల పరిధిలో 50 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరమైతే కేవలం 6.5 మెట్రిక్ టన్నుల కందిపప్పు మాత్రమే వచ్చింది. జిల్లాలో దాదాపు 6.5 లక్షల మంది తెల్లకార్డు లబ్ధిదారులు ఉన్నారు. వీరికి పంపిణీ చేసేందుకు దాదాపు 350 టన్నుల కందిపప్పు అవసరం. కానీ జిల్లాకు ఇప్పటివరకు 170 టన్నులే వచ్చింది. ఇందులో వంద టన్నులు మాత్రమే లబ్ధిదారులకు సరఫరా చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలింది పండగ తర్వాత ఇస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీనివాసరావు తెలిపారు. వచ్చేనెలలో పూర్తిస్థాయిలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం) నరసన్నపేట గ్రామీణం

అసుర సంహారిణి.. అభయ ప్రదాయని..!


శ్రీకాకుళం నగరం: నానుబాలవీధిలో మహిషాసుర మర్దనిగా విజయదుర్గాదేవి

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి ఆలయాలు, దేవీపీఠాలు, దుర్గామాత మండపాల్లో మహర్నవమి పూజలు చేశారు. జగన్మాత వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనలు, మహాపూర్ణాహుతి, ప్రత్యేక హోమాలు చేశారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం


ఇచ్ఛాపురంలో పూజలందుకుంటున్న స్వేచ్ఛావతి అమ్మవారు


పాతపట్నం: ప్రత్యేక అలంకరణలో నీలమణిదుర్గ అమ్మవారు


గార: సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వేచ్ఛావతి అమ్మవారికి సమర్పించిన 225 రకాల ప్రసాదాలు

ప్రజల భాగస్వామ్యంతోనే టెక్కలి అభివృద్ధి


శ్రీనివాసనగర్ ప్రాంతంలో సూచనలు చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రజల భాగస్వామ్యంతోనే టెక్కలిని అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ముందుగా ఎన్టీఆర్ పార్కు కూడలి నుంచి చిన్నబజారు వరకు వెళ్లి అక్కడ వీఆర్వోల సంఘ స్థలాన్ని తోపుడు బండ్ల వ్యాపారులకు కేటాయించి టెక్కలిలోని అన్ని తోపుడుబళ్లను అక్కడికి తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయ సముదాయంలో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై పలు సూచనలు చేశారు. అంబేడ్కర్ కూడలి నుంచి శ్రీనివాసనగర్ వరకు కాలి నడకన పర్యటించారు. టెక్కలిలో విచ్చలవిడిగా జరిగిన ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టం చేశారు. పట్టణంలో పశువులు, పందులను రోడ్లపై విడిచిపెడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఆర్డీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ రవీన్ చక్రవర్తి, పట్టణ తెదేపా అధ్యక్షుడు కోళ్ల లవకుమార్, తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా


తరుణ్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు సత్తాచాటాడు. హిమాచల్‌ప్రదేశ్ వేదికగా ఈ నెల 6 నుంచి జరుగుతున్న పోటీల్లో శ్రీకాకుళం నగరం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ తరుణ్ 285 కిలోల బరువు ఎత్తి రజత పతకం సొంతం చేసుకున్నాడు. పోటీల్లో తరుణ్ స్నాచింగ్ 125 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 160 బరువులు ఎత్తి ఈ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు శిక్షకుడు ముద్దాడ సూర్యారావు, ఇప్పిలి అప్పన్న తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బంజరాపు భాస్కరరావు, కొత్తకోట శ్రీను అభినందించారు.

కారు బోల్తా

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న కారు లొద్దపుట్టి వద్ద పాఠశాల సమీపంలో శుక్రవారం అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. అక్కడ ఉన్న వారు గమనించి అందులో ప్రయాణిస్తున్న ముగ్గురిని బయటకు తీసుకొచ్చారు. సురక్షితంగా బయటపడటంతో మరో కారులో గమ్యస్థానానికి బయలుదేరి వెళ్లారు.

కశ్మీర్‌లో మెరిసిన పలాస బాలిక..!

– న్యూస్‌టుడే, పలాస (క్రీడలు)

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో సత్తా

ఏడాది కిందట రాష్ట్ర స్థాయి పోటీలకు అనకాపల్లి వెళ్లడం మినహా ఆ బాలిక ఎప్పుడూ జిల్లా దాటలేదు. ఆటపైనే తనకున్న అపేక్ష బలమైన సంకల్పంగా మార్చుకొని మూడో ప్రయత్నంలో జాతీయ స్థాయికి ఎంపికైంది. పలాస నుంచి జమ్మూకశ్మీర్ వెళ్లి టెన్నికాయిట్ పోటీల్లో రింగు విసిరింది. తొలి ప్రయత్నంలోనే పతకం సొంతం చేసుకుంది.

★ పలాసకు చెందిన పొందర దుర్గారావు, కాంతమ్మ దంపతుల కుమార్తె శ్రావణిపాత్రో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తండ్రి తాపీ మేస్త్రీ, తల్లి జీడి పరిశ్రమలో కార్మికురాలు. తొమ్మిదో తరగతి చదువుతుండగా వ్యాయామోపాధ్యాయుడు పి.తవిటయ్య ప్రోత్సాహంతో టెన్నికాయిట్‌లో మెలకువలు నేర్చుకుంది. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. అనకాపల్లి, పాతపట్నంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరైంది. ఈ ఏడాది వజ్రపుకొత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో సత్తా చాటి తొలిసారి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.


జ్ఞాపిక అందుకుంటున్న శ్రావణి

★ జమ్మూకశ్మీర్‌లో గత నెల 30 నుంచి ఈ నెల 4 వరకు నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఆరుగురు సభ్యులున్న ఆంధ్రప్రదేశ్ జట్టు టీం చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం అందుకుంది. అనంతపురం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల సభ్యులతో కూడిన జట్టులో శ్రావణి సత్తా చాటింది. అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరచడమే తన లక్ష్యమని.. ఈ దిశగా సాధన చేస్తానని ఆమె 'న్యూస్‌టుడే'కు తెలిపింది.

హత్య కేసులో మరో నలుగురి అరెస్టు

నరసన్నపేట, న్యూస్‌టుడే: పోలాకి మండలం వనవిష్ణుపురం హత్య కేసులో మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 8న జరిగిన వైకాపా మా[illegible] దాడిలో పాలిన వీరాస్వామి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా, శుక్రవారం తంగాన రాజు, నూనెల తిరుపతిరావు, లచ్చయ్య, రమేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మరో ఆరుగురి కోసం గాలిస్తున్నారు.

పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవు


జిల్లా ఆసుపత్రి ఫార్మసీ విభాగంలో దస్త్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలోని జిల్లా ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యులు పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ విభాగాలతో పాటు ఫార్మసీ, ఎస్ఎన్‌సీయూ, శస్త్ర చికిత్సల విభాగాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాన్పుల విభాగంలో మధ్యాహ్నం కావస్తున్నా చంటి పిల్లల్ని పరీక్షించేందుకు వైద్యుడు రాకపోవడంపై ప్రశ్నించారు. వైద్య పరికరాలు తుప్పుపట్టి ఉండటం, డైట్ విభాగంలో కుళ్లిపోయిన కూరగాయలను పరిశీలించి పద్ధతులు మార్చుకోవాలన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు ఆసుపత్రిలో పరిశీలించి సూచనలు చేశారు.

కాలువ ఇలా.. సాగునీరు పారేదెలా..!



బూర్జ మండలంలోని బొమ్మిక గజ్జిలి గెడ్డ కాలువ ఇది. సుమారు పది కిలోమీటర్ల మేర కాలువకు ఇరువైపులా మట్టి కట్ట ఆక్రమణ గురైంది. దీంతో 9 మీటర్ల మేర సాగునీరు వెళ్లేలా నిర్మించిన కాలువ లోపలిభాగం క్రమేపి తగ్గిపోతుంది. కాలువ నిండా పనికిరాని మొక్కలు, గడ్డి దట్టంగా వ్యాపించాయి. కాలువ పొడవునా నిర్మించిన చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరుకుంది. దీని పరిధిలో అభివృద్ధి పనులు చేపడితే వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని ఆయకట్టు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జలవనరులశాఖ ఏఈఈ బి.శంకరరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, బూర్జ

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	9440437129
పలాస	8008574279
కవిటి గ్రామీణం	8309638875
పలాస గ్రామీణం	7386408926
కంచిలి గ్రామీణం	9704568738

సమస్య: ఇచ్ఛాపురం పట్టణం చిన్నాకుల వీధి నుంచి పంజా వీధి వరకు రహదారి అధ్వానంగా ఉంది. **-పి.జోగేష్, ఇచ్ఛాపురం**

సమాధానం: సమస్యను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. **-ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం**

సమస్య: పలాస మండలం అల్లుఖోల శివాలయం వీధిలో రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం: త్వరలోనే రోడ్డు నిర్మిస్తాం. **- చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి, అల్లుఖోల**

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

రతన్‌టాటా సేవలు ఎనలేనివి



టాటా గ్రూపు సంస్థల అధినేత రతన్ టాటా సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస తెదేపా కార్యాలయంలో శుక్రవారం రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లక్షల మందికి ఉపాధి చూపారని ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, నాయకులు దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

శ్రీవారికి నృత్యనీరాజనం



తిరుమలలో బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఇచ్ఛాపురంలోని శ్రీ స్వేచ్ఛా నృత్యతరంగిణి కళాకారులు శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. తితిదే ఆహ్వానం మేరకు సంస్థ అధ్యక్షుడు కరణం గోవిందరావు, కోశాధికారి మంగి దాలమ్మ ఆధ్వర్యంలో నాట్యగురువు దివ్య, 24 మంది కళాకారులు మాడ వీధుల్లో నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు ఘనంగా సత్కరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

జగన్మాత నమోస్తుతే



బారువలో మహిషాసుర మర్దినిగా కనకదుర్గమ్మ

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మహర్నవమి సందర్భంగా శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. పలు ఆలయాలు, మండపాల్లో చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ జరిగింది. – వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, సోంపేట



ఇచ్ఛాపురం: పురుషోత్తపురంలో కొలువైన కనకదుర్గమ్మ



వజ్రపుకొత్తూరు మండలం బైపల్లిలో దుర్గాదేవి మండపం వద్ద భక్తజనం



సోంపేట: బారువలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



ఇచ్ఛాపురం గ్రామీణం: ఇన్నేసుపేట మండపంలో కొలువైన దుర్గమ్మ వద్ద ఎమ్మెల్యే అశోక్, నాయకులు, భవానీ దీక్షాధారులు

శ్రమించారు.. శుభ్రం చేశారు



మందస మండలం మీలగంగువాడలో రహదారిని శుభ్రం చేసిన గ్రామస్థులు

హరిపురం (మందస), వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపు మేరకు మందస మండలం రాంపురం పంచాయతీ మీలగంగువాడ, వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం పంచాయతీ పరిధి పీఎంపురం, సీఎంపురం గ్రామాల్లో శుక్రవారం మన పలాస-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రహదారులకు ఇరువైపులా ఉన్న పొదలు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. కాలువల్లో పూడిక తీశారు.

తెలంగాణ డీఎస్సీలో తొమ్మిదో ర్యాంకు



కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధి బురదపాడు గ్రామానికి చెందిన బుడ్డేపు చంద్రశేఖర్, నీలమ్మ దంపతుల కుమారుడు **తారకేశ్** మహబూబాబాద్ జిల్లా ఎస్జీటీ విభాగంలో తొమ్మిదో ర్యాంకు సాధించారు. ఆయన ఎంఎస్ పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు, కంచిలిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివారు. బొమ్మూరులో డీఈడీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్థులు అభినందించారు.



అధ్వాన రోడ్డుతో వెతలు



పలాస మండలం పూర్ణభద్రలో ప్రధాన వీధి రోడ్డు అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాహుల్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా వారం రోజుల్లో రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఏఎస్‌పేటలో అంధకారం



ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి ఏఎస్ పేట చిన్నవీధిలో మూడు స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగడం లేదు. నెల రోజులుగా రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నామని పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై పురపాలక ఏఈ పి.స్వరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

టీపీసీ ఛైర్మన్‌కు సత్కారం



పలాస: శుక్రవారం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావును కార్మిక, పారిశ్రామికవాడ కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి కృష్ణమూర్తి, సానా ఈశ్వరరావు, కోశాధికారి కె.రాము, గౌరవాధ్యక్షుడు బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

తపాలా ఉద్యోగుల ప్రదర్శన

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలో శుక్రవారం తపాలా ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఆ శాఖ సోంపేట సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఇచ్ఛాపురం ఉప తపాలా కార్యాలయ అధికారి జ్ఞానవతి ఆధ్వర్యంలో డాక్ చౌపాల్ (జనంలోకి మనం) కార్యక్రమం జరిగింది. తపాలా కార్యాలయం నుంచి కోట వీధి కూడలి, బ్రాహ్మణ వీధి, రథం వీధి, దాసన్నపేట, ప్రధాన రహదారి, బస్టాండు కూడలి, ఆసుపత్రి రోడ్డు, పంజా వీధి మీదుగా కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లారు. పలు చోట్ల తపాలా సేవలు వివరించారు.





ఉపాధి కల్పనలో కేంద్రం విఫలం



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డా.జి.వి.ఈశ్వరరావు అన్నారు. ఈ నెల 16న జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో దిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కాశీబుగ్గలో శుక్రవారం ఆవిష్కరించారు. నాయకులు డా.పి.కిరణ్ కుమార్, టి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌లకు అభినందన



కవిటి మండలం కొత్త పుట్టుగ గ్రామానికి చెందిన నర్తు సింహాద్రి, కొల్ల కృష్ణ ఇటీవల అగ్నివీర్‌లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జగద్గురు యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వారిని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఘనంగా సత్కరించారు. యువజన సంఘం అధ్యక్షుడు మామిడి సంతోష్, కార్యదర్శి నర్తు నాగరాజు, గ్రామ పెద్దలు నర్తు సీతయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం





క్విజ్ విజేత కవిటి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో గ్రామ పెద్దలు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి నెలవంకలో శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీహెచ్ఎస్ (సిలగాం), ఉన్నత పాఠశాల (బొరివంక) వరుస స్థానాల్లో నిలిచాయి. బెస్ట్ టీమ్‌గా హరిపురం నిలిచింది. క్విజ్ మాస్టర్లుగా శ్రీరాంమూర్తి, బి.లక్ష్మణమూర్తి, బాలక శ్రీనివాసరావు వ్యవహరించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



సాహిల్‌కుమార్

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాపాక సాహిల్‌కుమార్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని పీడీ సీహెచ్ఆర్ రామ్‌జీ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.వీర్రాజు, పలువురు ఉపాధ్యాయులు బాలుడిని అభినందించారు.







వైకాపా నేతలది దుష్ప్రచారమే

పలాస, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితులకు అందించిన సాయంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, వైకాపా నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆక్షేపించారు. ఈమేరకు శుక్రవారం ఆమె మాట్లాడిన వీడియో విడుదల చేశారు. వైకాపా నాయకుల నోటి నుంచి వచ్చే ప్రతీ మాట అబద్ధమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని కోరారు.

కొనసాగుతున్న బెంతొరియాల దీక్షలు


కవిటి, న్యూస్‌టుడే: కుల ధ్రువీకరణ పత్రాల కోసం కవిటిలో బెంతొరియాలు చేపట్టిన దీక్షలు శుక్రవారం కొనసాగాయి. 290 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.



స్నేహితుడికి ఆర్థిక సాయం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి ఎస్వీజే కళాశాలలో 2007-2010 బ్యాచ్ డిగ్రీ విద్యార్థి పొల్లాయి మండల నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు వైద్య ఖర్చులకు శుక్రవారం రూ.45 వేలు అందజేశారు. సావాడ గణేష్‌రెడ్డి, లండ నరేష్, మామిడి బాబూరావు, నర్తు ధర్మతేజ, ఎం.పవన్ కుమార్ పాల్గొన్నారు.





శిర్డీ సాయికి పుష్పార్చన

పలాస, న్యూస్‌టుడే: శిర్డీ సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాల్లో భాగంగా రైల్వేస్టేషన్ రోడ్డులోని మందిరంలో శుక్రవారం వివిధ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ధ్యాన మందిరంలో సామూహిక పారాయణం చేశారు. ఆలయ కార్యదర్శి జీజేఎస్ రెడ్డి, కమిటీ సభ్యులు జి.లలిత, పుట్టా లోకనాథం, ప్రశాంత్, నాగరాజు, పవన్, లక్ష్మీనారాయణ, ప్రవల్లిక, కీర్తిక, పాల్గొన్నారు.







టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

బ్రహ్మోత్సవాల్లో కోలాట ప్రదర్శన




తిరుమలలో లక్ష్మీనర్సింహ కోలాట బృందం ప్రదర్శన

నరసన్నపేట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నరసన్నపేటకు చెందిన లక్ష్మీనర్సింహ కోలాట బృందం ప్రదర్శన అలరించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వవాహన సేవలో ఈ బృందం సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. బృందం అధ్యక్షురాలు వారణాశి సంతోషి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది.

దూరవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి, న్యూస్‌టుడే: నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రణవి డిగ్రీ కళాశాల దూరవిద్య కేంద్రం ఛైర్మన్ పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పీజీలో సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో ప్రవేశాలకు సంబంధించి యూజీసీ, డెబ్ అనుమతులు లభించాయన్నారు. ఈ నెల 30వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, ప్రిన్సిపల్ రుక్మాంగధరావు ఉన్నారు.

పద్మనాభసాగరాన్ని పట్టించుకోరా..!



కొత్తూరు మండలంలోని బలద పద్మనాభ సాగరం పూడిక, పనికిరాని మొక్కలతో నిండిపోయింది. దీంతో వందెకరాల సాగరం చిన్నబోయింది. మరికొంత ఆక్రమణలతో చిక్కిపోయింది. 1,200 ఎకరాలకు సాగునీరు అందించే సాగరంపై పచ్చుటి నిర్లక్ష్యం అలముకుంది. రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. సాగరాన్ని మెరుగుపరిచి సాగునీటి ఇబ్బందులు తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణప్రసాద్ స్పందిస్తూ పద్మనాభసాగరాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, కొత్తూరు

వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం తగదు



కోవెలవీధిలో రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి తదితరులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరును నిశితంగా పరిశీలించారు. కొందరు అనధికారికంగా గైర్హాజరైనట్లు గుర్తించారు. అనంతరం కోవెలవీధిలో రహదారులు, కాలువల తీరును ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు మేజర్ పంచాయతీ ఉప సర్పంచి సాసుపల్లి కృష్ణబాబు, తెదేపా నాయకులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, పీఆర్ఏఈ బగ్గు నర్సింగరావు తదితరులు ఉన్నారు.

కోర్టు భవనాల మంజూరుకు వినతి



మెండ లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న టెక్కలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో నూతన కోర్టు భవనాలకు అనుమతులు, నిధుల విడుదలకు తన వంతు కృషి చేయాలని హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల నియమితులైన మెండ లక్ష్మీనారాయణను టెక్కలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సంతబొమ్మాళి మండలం కృష్ణచంద్రాపురం గ్రామంలో ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, కార్యదర్శి ఎస్. దివాకర్, న్యాయవాదులు పి. సాయిరాజు, పి. ఆనంద్ ఉన్నారు.

నిర్దేశిత ధరలకే విక్రయించాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నిత్యావసర సరకులు విక్రయించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. మండలంలో పలు వ్యాపారుల దుకాణాలను పరిశీలించారు. వంట నూనెలు పామాయిల్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124 ధరలకు మించి విక్రయాలు చేపట్టకూడదంటై వ్యాపారులను సూచించారు. ఇందులో భాగంగా చాపర, మెళియాపుట్టి గ్రామాల్లో పలు హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను పరిశీలించారు. తహసీల్దార్ పాపారావుతో పాటు డీటీ రాము, సీనియర్ సహాయకులు జగన్‌మోహన్‌రావు, వీఆర్వో యుగంధర్ తదితరులు ఉన్నారు.

మహిషాసురమర్దిని నమోస్తుతే..!



నరసన్నపేట గ్రామీణం: ఉర్లాం మార్కెట్ కూడలిలో..



హిరమండలం: సుభలయలో...



నందిగాంలో...



సారవకోట: అవలంగి నీలమణిదేవికి అలంకరణ



ఎల్ఎన్‌పేట: కోవిలాంలో పూజలందుకున్న దుర్గాదేవి



టెక్కలిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి: నిమ్మాడ కూడలిలో...



జలుమూరు: పూజలందుకున్న అమ్మవారు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు దేవాలయాలు, మందిరాలు, పీఠాల్లో భక్తులు దుర్గాదేవికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

రూ.4.18 కోట్లతో అభివృద్ధి పనులు

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధుల నుంచి రూ. 4.18 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో కాళీప్రసాదరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం పేరుతో మంజూరైన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అంతిమ యాత్రకు అవస్థలు



మండలంలోని లచ్చన్నపేట గ్రామ శ్మశానవాటికకు సరైన రహదారి మార్గం లేకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన బలగ మహలక్ష్మి దళిత మహిళ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పొలాల మధ్య నుంచే మోసుకెళ్లి బంధువులు, గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. శ్మశానవాటికకు రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

నాటుసారా తరలిస్తున్న వారిపై కేసుల నమోదు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం ఆర్టీసీ సముదాయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నాటుసారా తరలిస్తున్న వారిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి. లావణ్య తెలిపారు. పాతపట్నానికి చెందిన నలుగురు వ్యక్తులు నాలుగు లీటర్ల సారాను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. అలాగే లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు 15 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్లు ఎస్సై తెలిపారు.

రేపు మాజీ సైనికోద్యోగుల సమావేశం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లోని మాజీ సైనికోద్యోగుల సంఘ భవనంలో ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు గొనప సోమేశ్వరరావు తెలిపారు. సంఘ పరిధిలోని మాజీ సైనికులు, వీరనారీమణులు, వితంతువులు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు నివేదిస్తాం

జలుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నదూగాం పంచాయతీ కాకర్లవాని చెరువు ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక రైతులతో శుక్రవారం శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష చర్చించారు. ఫిర్యాదుదారులు, రైతులతో చర్చించిన విషయాన్ని కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. తహసీల్దార్ జన్ని రామారావు, డీటీ మధు, ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు ప్రాధాన్యం ఇవ్వాలి

హిరమండలం, న్యూస్‌టుడే: తూర్పు కాపులకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ తూర్పుకాపు సంక్షేమ సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ కోరారు. శుక్రవారం హిరమండలంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తూర్పుకాపులు అత్యధిక శాతం మంది ఉన్నప్పటికీ గత పుష్కర కాలంగా రాజకీయంగా ముఖ్య పదవులు ఇవ్వడం లేదన్నారు.

దువ్వాడ, మాధురిలను అరెస్టు చేయాలి

టెక్కలి, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాధురిలను వెంటనే అరెస్టు చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోకర నారాయణరావు, అక్కురాడ లోకనాథం డిమాండు చేశారు. శుక్రవారం టెక్కలిలో విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హిందువులు కలియుగ దైవంగా కొలుచుకునే వెంకటేశ్వరుని సన్నిధిని వారి రీల్స్‌కు వేదికగా చేసుకున్నారన్నారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టి దేవస్థాన ప్రతిష్ఠను దిగజార్చారని ఆరోపించారు.

జలుమూరు తహసీల్దారుగా రామారావు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు తహసీల్దారుగా జన్ని రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన లక్ష్మీనారాయణ బదిలీపై కలెక్టరేట్‌కు వెళ్లారు.

గిరిజన ఉత్పత్తులు ఓఎన్‌డీసీలో నమోదు చేసుకోవాలి



గిరిజనులు ఉత్పత్తి చేసే ఉత్పత్తులను ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ సిస్టమ్(ఓఎన్‌డీసీ)లో నమోదు చేసుకోవాలని ఏపీఎం పి. కూర్మారావు అన్నారు. శుక్రవారం లోకొండ, మామిడిజోల, నౌగుడ గ్రామాల్లో ఆయన పర్యటించారు. మన్యదీపిక వన్ ధన్ వికాస కేంద్రంలో గిరిజన ఉత్పత్తులు పరిశీలించారు. సభ్యులకు పలు సూచనలిచ్చారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, వీఎస్ఏ బొంతు సరస్వతి, సీసీలు జయంతి, శ్రీదేవి, అప్పన్న, అసిరయ్య పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

అవీ..ఇవీ..అన్నీ

కొత్తమ్మ తల్లిని దర్శించుకున్న ప్రముఖులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మ తల్లి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ దంపతులు అమ్మవారిని శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో రాధాకృష్ణ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ● కొత్తమ్మ తల్లిని జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు దంపతులు దర్శించుకొని పూజలు చేశారు.



రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో టెక్కలిలోని ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందుతున్న తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు శిక్షకుడు నర్సిపురం శేఖర్ తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పోటీల్లో టెక్కలికి చెందిన మెండ తపస్వి 14 ఏళ్ల విభాగంలో స్వర్ణపతకం సాధించగా, 17 ఏళ్ల విభాగంలో పులిబంద జాస్విక సర్ణ పతకాన్ని సాధించినట్లు చెప్పారు. 14 ఏళ్ల విభాగంలో ఎస్. మోహిత్ రజత పతకాన్ని సాధించాడన్నారు. క్రీడాకారులను డీఎస్‌డీవో కల్లేపల్లి శ్రీధర్, టీం మేనేజర్లు పడాల అక్షా, తాస్వి అభినందించారు.

పోలవరం వాసికి డాక్టరేట్

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పోలవరం గ్రామానికి చెందిన దవళ వెంకటేష్‌కు చెన్నైలో జరిగిన గ్లోబల్ ఎచీవర్స్ కౌన్సిల్ అవార్డు కార్యక్రమంలో సౌత్ వెస్టన్ అమెరికన్ యూనివర్సిటీ వారు సోషల్ వర్క్‌లో భాగంగా గౌరవ డాక్టరేట్‌ను శుక్రవారం ప్రదానం చేసింది. ఆయనను ఈ సందర్భంగా గ్రామస్థులు అభినందించారు.

బీరు సీసాతో దాడి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డిపై బీరు సీసాతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడి తోటలో హనుమంతునాయుడుపేటకు చెందిన సతీష్‌కుమార్ బీరు తాగుతుండటంపై ప్రశ్నించిన నేపథ్యంలో బీరు సీసాతో దాడి చేసి గాయపరిచినందుకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు

హిరమండలం, న్యూస్‌టుడే: ఇటీవల పాతపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీకి చెందిన పలు బ్యానర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేసి తొలగించడంతో ఆ పార్టీ నాయకులు గట్టి హెచ్చరిక చేశారు. గొట్ట గ్రామం గొట్టాబ్యారేజీ ముఖ ద్వారం వద్ద ఆ పార్టీ నియోజకవర్గం, మండల నాయకులు హెచ్చరిక చేస్తూ గాజులు, చీర, అలంకరణ వస్తువులు, చెప్పులు ఉన్న బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.



తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తు వదలరా-2 ★ మారుతి: మా నాన్న సూపర్ హీరో

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

● శ్రీకాకుళం ● ఆమదాలవలస ● ఎచ్చెర్ల

పశువుల వ్యర్థాలతో దుర్వాసన..

శ్రీకాకుళం నగరం సీపన్నాయుడుపేట నుంచి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సీసీ రహదారిని కొందరు ఆక్రమించి పశువుల వ్యర్థాలు నిల్వ చేయడానికి వినియోగిస్తున్నారు. ఆ ప్రాంత ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయి.



– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం


దూదివారి వీధిలో..


పొందూరు: కంచికామాక్షి ఆలయంలో


ఉమారుద్రకోటేశ్వరాలయంలో..


పెద్దబరాటం వీధిలో..


పాతశ్రీకాకుళంలో..

జయ జయహే మహిషాసురమర్దిని


పాండురంగవీధిలో కామాక్షిపీఠంలో..


గోవింద్‌నగర్ కాలనీలో..

శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నసమారాధన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దుర్గమ్మను దర్శించుకున్నారు. శనివారం విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లు కళకళలాడాయి. – న్యూస్‌టుడే, బృందం


ఆమదాలవలస పట్టణం: పాలపోలమ్మతల్లికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పూజలు

దారి గోతులమయం..



ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో పార్వతీశంపేట-తిమ్మాపురం గ్రామాల మధ్య రహదారిలో గోతులతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. పనుల్లో నాణ్యత లోపించడంతో కొద్ది రోజులకు గోతులమయంగా మారింది. ఈ మార్గంలో భారీ వాహనాలు, ఇసుక లారీలు వెళ్తుండటంతో పూర్తిగా మరమ్మతులకు గురైందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్ స్పందిస్తూ గోతులు పూడ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

రతన్ టాటాకు నివాళి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపార వేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు పీజీగుప్త, జి.ఇందిరాప్రసాద్, బి.వి.రవిశంకర్, ఎస్.జోగినాయుడు, ఎం.వాసుదేవాచారి, గేదెల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



రూ.4.18 కోట్లతో అభివృద్ధి పనులు

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ నిధుల నుంచి రూ.4.18 కోట్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో కాళీప్రసాదరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం పేరుతో మంజూరైన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.





వైకాపా దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్, చిత్రంలో ఇతర నాయకులు

అరసవల్లి, న్యూస్‌టుడే: వైకాపా నేతల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. శ్రీకాకుళం నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. శ్రీకాకుళం నియోజకవర్గానికి రూ.32 కోట్లతో పనులు మంజూరయ్యాయి. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు నిర్మాణం జరుగుతుంది. వాటిని చూసి ఓర్వలేక తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, సీదిరి అప్పలరాజుకు సీఎం చంద్రబాబును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. గత ఐదేళ్లు దోచుకోవడం-దాచుకోవడం తప్ప వాళ్లేం చేశారు? పలాసలో కొండలు మింగిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు జిల్లాకు విమానాశ్రయం రావడం కల అని, మూలపేట పోర్టు పనులు జరగవని చెప్పడం అసత్యం. గతంలో చంద్రబాబు భావనపాడు పోర్టుకు శంకుస్థాపన చేస్తే ఆయనకు పేరొస్తుందని దాన్ని మూలపేటకు మార్చారు. అనంతరం అరసవల్లికి చెందిన వడ్డి కల్యాణికి రూ.1.5 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం


మణిపాత్రుని నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఎచ్చెర్ల(రణస్థలం), నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సామాజిక సేవ విద్యా రంగంలో విశేష కృషికిగాను ఎచ్చెర్ల మండలం ముద్దాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణిపాత్రుని నాగేశ్వరరావుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆముదాలవలస ఉత్తమ సేవా పురస్కారం అందించింది. ఈ మేరకు రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఈ సేవా పురస్కారాన్ని అందజేసి ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పల్లె తేజ లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, సినీ గాయకులు కుప్పిలి గోపికృష్ణ పాల్గొన్నారు.

శాసనమండలి ఎన్నికలకు సహకరించండి

ఉత్తరాంధ్రలో త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సహకరించాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. శుక్రవారం రణస్థలం మండలంలో ఆయనను పీఆర్టీయూ శాఖ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను శ్రీనివాసులనాయుడు ఆయనకు తెలియజేశారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం


రైతుబజారులో వంటనూనె విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక రైతుబజారులో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వంట నూనె విక్రయ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రంలో పేదలందరికీ నిత్యవసర సరుకులు అందుబాటులో ఉండే ధరలు ఉండాలనే ఈ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, కూటమి నాయకులు బొర గోవిందరావు, కూన భానోజీరావు, ఎన్ని శ్రీదేవి, అన్నెపు భాస్కరావు పాల్గొన్నారు. ★ పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని అన్న కాంటీన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తహసీల్దారుకు అభినందన



బూర్జ మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన పద్మావతిని శుక్రవారం తెదేపా మండల ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నాయకులు తోట అప్పలరాజు, కె.సాయికుమార్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే,బూర్జ

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు

ఎచ్చెర్ల మండలం డీమత్స్యలేశంలోని శ్రీలంక అమ్మవారి గుడి వీధిలో రాత్రి వేళ లోఓల్టేజ్ సమస్య ఏర్పడుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండే వారు. ఈ సమస్యపై ఇటీవల ఈనాడు పత్రికలో 'నిర్లక్ష్యం వీడేనా.. విద్యుతు సమస్య తీరేనా..?' శీర్షికతో వచ్చిన వార్తపై స్పందించిన ఆ శాఖ అధికారులు విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేశారు. –న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

స్పందనకు వందనం



మొక్కలు తొలగింపు



పొందూరు మండలం తాడివలస నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో బొడ్డేపల్లి గ్రామం వద్ద మార్గానికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పనికిరాని మొక్కలను ఆర్అండ్‌బీ సిబ్బంది తొలగించారు. ఇవి పెరిగిపోయి ముందుకు చొచ్చుకురావడంతో రాకపోకలకు వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 7న 'ఈనాడు'లో 'రాకపోకలకు ఇక్కట్లు' శీర్షికతో ప్రచురించిన సమస్యపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వీటిని తొలగింపజేయించారు. – న్యూస్‌టుడే, పొందూరు